మేలో పిఒడబ్ల్యు రాష్ట్ర మహాసభ

- ఫిబ్రవరి 16న గ్రామీణ, పారిశ్రామిక బంద్‌కు మద్దతు
- రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పిఒడబ్ల్యు రాష్ట్ర ఆరో మహాసభలు హైదరాబాద్‌లో మే నెలలో జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ ప్రకటించారు. ట్రేడ్‌యూనియన్లు, ఎస్‌కెఎం సంయుక్త పిలుపులో భాగంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ, పారిశ్రామిక బంద్‌కు మద్దతిస్తున్నామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడాన్ని స్వాగతించారు. మహిళా కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్‌లను వెనక్కి తీసుకోవాలనీ, రైతులకు ఇచ్చిన హామీ మేరకు కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ మాట్లాడుతూ..మార్చి, ఏప్రిల్ నెలల్లో గ్రామ, మండల, జిల్లా మహాసభలను పూర్తిచేస్తామన్నారు. దేశంలో బిజెపి మతం ముసుగులో దాడులను తీవ్రతరం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు మహిళలపై లైంగిదాడులు, వేధింపులు తీవ్రమయ్యాయని వాపోయారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. ఆ సంఘం కోశాధికారి గీత మాట్లాడుతూ..వికారాబాద్‌లో దేవాలయం ముందు భిక్షాటన చేసే కుటుంబానికి చెందిన ఆరేండ్ల బాలికపై దేవాలయంలో ఉండే కుటుంబానికి చెందిన వ్యక్తి లైంగిక దాడి చేశాడనీ, దీన్ని పోలీసులు కప్పిపుచ్చేందుకు యత్నించారని విమర్శించారు. తమ సంఘం పోరాటంతో పోలీసులు కేసు నమోదు చేశారనీ, ఆ ఘటనలో ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి సీత మాట్లాడుతూ..రాష్ట్రంలోని బెల్టుషాపులు కుటుంబాలను ఆగం చేస్తున్నాయనీ, వాటిని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు జానకి, కావేరి, ఉపేంద్ర పాల్గొన్నారు.

బిజెపి హఠావో... దేశ్‌కో బచావో

- అధ్యక్ష తరహా పాలన కోసమే ఒకేదేశం... ఒకే ఎన్నికలు
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 'బిజెపి హఠావో... దేశ్‌కో బచావో'అన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. అధ్యక్ష తరహా పాలన కోసమే ఒకేదేశం ఒకే ఎన్నికలను బిజెపి తెరపైకి తెచ్చిందని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం నుంచి దేశానికి, ప్రజలకు విముక్తి కల్పించడమే లక్ష్యమని ప్రకటించారు. మూడు రోజులపాటు జరగనున్న సిపిఐ జాతీయ సమితి సమావేశాలు హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రామకృష్ణ పండా, కూనంనేని సాంబశివరావు, నిషా సిద్దూ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసంలో డి.రాజా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని అంతమొందించి, ఏకస్వామ్య, ఫాసిస్టు, నియంతృత్వ వ్యవస్థను తెచ్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో లౌకిక, ప్రజాస్వామ్య విలువలతో పనిచేసే పార్టీలు గెలవాలని ఆకాంక్షించారు. బిజెపిని గద్దెదించడమే ప్రజల ముందున్న కర్తవ్యమని అన్నారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు, ఇతర శక్తులు ఐక్యంగా పనిచేయాలని కోరారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పేదల కోసం కాదనీ, కార్పొరేట్లు, బడా పారిశ్రామికవేత్తల కోసమేనని విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేశారా? మహిళలపై లైంగిక వేధింపులు, దాడులను అరికట్టారా? అని నిలదీశారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని బిజెపి నాయకులు చెప్తున్నారని... అంతర్జాతీయ ఆకలి సూచీలో 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందని చెప్పారు. రాముని పేరు చెప్పి రాజకీయం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మోడీ చెప్పే రాముడు, గాంధీ చెప్పే రాముడికి తేడా ఉందన్నారు. కానీ పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించిన ఎంపిలను మోడీ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కబంధహస్తాల నుంచి దేశాన్ని, ప్రజలను విముక్తి చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని పిలుపునిచ్చారు. ఆ దిశగా పార్లమెంటు ఎన్నికల్లో పనిచేయాలని పార్టీ నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

ఆ చిరుతను పట్టుకోండి

- ఫారెస్టు అధికారులకు పర్గెయిన్ ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్న చిరుతను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆ జిల్లాల ఫారెస్టు అధికారులను చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎం.సి.పర్గెయిన్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంత కాలంగా ఆ రెండు జిల్లాల పరిధిలో తిరుగుతున్న చిరుతపులి పలుమార్లు రైతుల కంట పడింది. పెంపుడు జంతువులపై దాడి చేస్తున్నది. దీంతో పొలాల్లోకి వెళ్లేందుకు జంకుతున్న రైతులు, అటవీ అధికారులను కలిసి సమస్యను విన్నవించుకున్నారు.

రేపు ఎస్‌వికెలో ఎఐఎఫ్‌ఎఫ డబ్ల్యుఎఫ్ జాతీయ సమావేశాలు

- తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మికుల సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్) సమావేశాలను ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్‌వికెలోని టిపిఎస్‌కే హాల్‌లో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పు పద్మ, హైదరాబాద్ డిఎఫ్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు అరుణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదివారం జరిగే జాతీయ సమావేశాలకు కేరళ మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ వి.మనోహరన్, ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేబశిస్ బర్మన్, పి.స్టాన్లీ, ఇతర జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. మత్స్యకారులకు రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియో, ఉచిత చేప పిల్లలివ్వాలనీ, పంచాయతీల పరిధిలోని చెరువులు, కుంటలను మత్స్యశాఖ పరిధిలోకి తేవాలనే డిమాండ్లపై తమ సంఘం తరపున పోరాడి విజయం సాధించామన్నారు. ప్రతి మత్స్యకారుడికి ద్విచక్ర వాహనాలు, మొబైల్ మార్కెటింగ్ వాహనాలు ఇప్పించడంలోనూ, చెరువుల లీజులను తగ్గించడంలోనూ తమ సంఘం కృషి మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖకు వెంటనే మంత్రిని నియమించాలని కోరారు. గత ప్రభుత్వంలో మత్స్య శాఖలో ఉచిత చేప పిల్లల పేరుతో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల, కలుషితమైన నీరు రావడం వల్ల చనిపోయిన మత్స్య సంపదకు ఇన్సూరెన్స్ కల్పించాలనీ, 50 ఏండ్లు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

పడగొడతామంటే.. ప్రజలు ఊరుకుంటారా?

- ఇది ప్రజాప్రభుత్వం.. కూలగొడతామంటే కట్టేసి కొడతారు
- కెసిఆర్ పాపాల భైరవుడు.. ఆయన మళ్లీ సిఎం కాలేరు
- బిఆర్ఎస్ ఎంపీ సీట్లు మోడీకి అమ్ముకోవడానికే..
- ఈ ప్రాంతానికి ఏమీ ఇవ్వని మోడీకి ఓటెందుకు వేయాలి..?
- మరోపక్షం రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ
- ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం..
- తెలంగాణ పునర్నిర్మాణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇంద్రవెల్లి గడ్డ నుంచే ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని హామీ



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"మరో ఆరు నెలల్లో ఈ ప్రభుత్వం పడిపోతుందని అక్కడక్కడ కొందరు మాట్లాడుతున్నారు.. ఎవడ్రా పడగొట్టేది.. వేలాది మంది యువకులు ఇక్కడ ఉన్నారు.. పడగొడతామన్న వారిని ఊర్లలో వేపచెట్టుకు కట్టేసి కొడతారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామంటే వారు ఊరుకుంటారా.. నీ కాందాన్ మొత్తం వచ్చినా బొర్లేసి తొక్కుతారు.. కెసిఆర్.. నిత్యానంద స్వామిలాగా ఒక దీవి కొనుక్కొని అక్కడ సిఎంగా ఉండాలి.. లేదంటే ఆయన ఫామ్‌హౌస్‌కైనా సిఎం కావాలి.. తప్పితే ఈ రాష్ట్రానికి ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కాలేరు.. రైతులు, ఆదివాసీలు, దళితులు, నిరుద్యోగులను నిలువునా ముంచిన పాపాల భైరవుడు కెసిఆర్" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి శుక్రవారం తెలంగాణ పునర్నిర్మాణం పేరిట కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. సభకు హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించారు. ఇంద్రవెల్లి నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. ఇక్కడ్నుంచే ఇందిరమ్మ రాజ్య స్థాపనకు శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. అంతకుముందు కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయాన్ని దర్శించుకున్నారు. అక్కడ రూ.ఏడు కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఇంద్రవెల్లి సభలో సిఎం ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన బిఆర్ఎస్ రాష్ట్రంలో ఎంపి సీట్లు గెలవాలని అంటోందని.. ఎంపి సీట్లు గెలిస్తే మోడీకి అమ్ముకుంటారని ఆరోపించారు. ఎన్‌డిఎకు మోడీ ఉన్నారని.. ఇండియా కూటమికి తాము ఉన్నామని.. ఎటూ లేని కెసిఆర్‌కు ఎందుకు ఓటేయాలని అన్నారు.

రాష్ట్రం మీద పడి దోచుకుతిన్నారు..

గత ముఖ్యమంత్రి కెసిఆర్ పదేళ్లలో అడవి బిడ్డల గురించి ఒక్కరోజైనా సమీక్ష చేశారా.. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకోవాలని ఏనాడైనా చర్చించారా.. నీ కుటుంబం కోసమే తెలంగాణ రాష్ట్రం వచ్చిందా.. నీ బిడ్డల కోసమే సోనియమ్మ రాష్ట్రాన్ని ఇచ్చారా అని సిఎం రేవంత్ ప్రశ్నించారు. పదేళ్లలో కెసిఆర్ దుర్మార్గమైన పాలన సాగించారని, రాష్ట్రం మీద పడి దోచుకుతిని విధ్వంస రాష్ట్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రూ.ఏడు లక్షల కోట్ల అప్పు తీసుకొచ్చిందని, వీటితో కడెం ప్రాజెక్టుకు కనీస మరమ్మతు చేయలేదని, సదర్‌మాట్ కూడా కట్టలేదని అన్నారు. మిషన్ భగీరథ పేరిట రూ.40వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఈ పథకం బాగా చేసినట్లయితే..తాగునీటి అవసరాల కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.65వేల కోట్లు కేటాయించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కోటి ఎకరాలకు నీళ్లిస్తామని చెప్పి లక్ష కోట్లు దోచుకున్నారని.. హెలికాప్టర్‌లో వస్తుంటే ఈ ప్రాంతమంతా ఎడారిలా కనిపిస్తోంది.. ఎక్కడ నీళ్లిచ్చారో కేసీఆర్ చెప్పాలని అన్నారు. ఎన్నికల్లో కూతురు ఓడిపోయినప్పటికీ దోపిడీ, పదవుల మీద వ్యామోహంతో మళ్లీ ఎమ్మెల్సీ ఇచ్చారని.. ఇక్కడి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. ప్రగతిభవన్ పేరిట గడి కట్టుకొని గద్దర్ అన్నను కూడా రానీయకుండా అడ్డుకున్నారని, ఆయన ఉసురు తగిలినందుకే ప్రభుత్వం కూలిపోయిందని ఎద్దేవా చేశారు. ఇంద్రవెల్లి ఘటనలో అమరులైన కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున కేటాయించి ఇళ్లు కట్టించి ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్యఆరోగ్యశాఖలో ఏడు వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని.. మరోపక్షం రోజుల్లో 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు కూడా భర్తీ చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు తప్పనిసరిగా కల్పిస్తామని హామీనిచ్చారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయలేదని కొందరు సన్నాసులు మాట్లాడుతున్నారని, మీరు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏనాడైనా ఆలోచించారా అని సీఎం ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే తాము రూ.పది లక్షలతో బీమా సౌకర్యం కల్పించామని.. త్వరలోనే రూ.500కే సిలిండర్ సౌకర్యాన్ని ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో లక్ష మంది ఆడబిడ్డల సమక్షంలో ప్రారంభిస్తామని చెప్పారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకొని తుమ్మిడి హెటీ, సదర్‌మాట్, కుప్టి ప్రాజెక్టులు నిర్మిస్తామని, కడెంకు మరమ్మతులు చేపడుతామని భరోసా ఇచ్చారు. తండా, గూడేలకు తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.

అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని చెప్పిన ప్రధాని మోడీ ఒక్కరికైనా ఖాతాలో వేశారా అన్నారు. ఈ ప్రాంతానికి ఏమీ ఇవ్వలేని మోడీకి ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, త్యాగధనుల కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు ఆదిలాబాద్ గడ్డ నుంచే కాంగ్రెస్ జెండా ఎగరాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండ సురేఖ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, వివేక్‌వెంకటస్వామి, ఆది శ్రీనివాస్, వేం నరేందర్‌రెడ్డి, డిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లు రవి, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, బల్మూర్ వెంకట్, మాజీ ఎంపి హన్మంతరావు, పార్టీ మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అధ్యక్షులు కొక్కిరాల సురేఖ, విశ్వప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం

- కార్పొరేట్లకు రుణాల మాఫీ.. పేదలకు అన్యాయం
- ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కుట్ర
- విశ్రాంత ఐఎఎస్ ఆకునూరి మురళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. కార్పొరేట్‌లకు రుణాలను మాఫీ చేసి పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని, పట్టణ ఉపాధి పథకాన్ని ప్రవేశ పెట్టాలని" డిమాండ్ చేస్తూ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టానికి గతేడాది రూ.89 వేల కోట్లు ఖర్చు చేసిన కేంద్రం.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించి 26 శాతం నిధులు పెంచామని పచ్చి అబద్ధం చెబుతోందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికే ఆన్‌లైన్ హాజరు, ఆధార్ బేస్డ్ పేమెంట్ విధానం తీసుకొస్తున్నారని తెలిపారు. దేవుడి పేరుతో ఓట్లు దండుకోవడానికి మాయ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల పేదరికం పెరుగుతుంటే.. పాపాలు చేసిన వారే పేదరికంలో ఉంటున్నారని తప్పుడు భావజాలన్ని ప్రచారం చేయడాన్ని తిప్పి కొట్టాలన్నారు. మానవహక్కుల వేదిక జాతీయ సమన్వయకర్త జీవన్ కుమార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును బిజెపి ప్రభుత్వం కాలరాస్తున్నదన్నారు. ఉపాధి హామీ పరిశోధకులు చక్రధర్ బుద్ధ మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

పురస్కారాలకు అర్హుల ఎంపిక సులువు కాదు

- జస్టిస్ రామలింగేశ్వరరావు

ప్రజాశక్తి కల్చరల్

ప్రముఖుల పేరిట బహూకరించే పురస్కారాలకు అర్హులను ఎంపిక చేయడం సులువు కాదని ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు అన్నారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో యువకళా వాహిని నిర్వహణలో విఖ్యాత నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు పేరిట అభినయ పురస్కారాలు నటులు జివి నారాయణ రావు, జెన్నీ, నాట్య గురువు డాక్టర్ ప్రసన్న రాణిలకు ముఖ్య అతిథిగా జస్టిస్ రామ లింగేశ్వర రావు బహూకరించి మాట్లాడారు. పురస్కారాలు అందుకొన్న ముగ్గురూ వారి వారి రంగాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నారనీ అభినందించారు. అధ్యక్షత వహించిన కళాభిమాని సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ అక్కినేని నటనలో వ్యక్తిత్వంలో ఉన్నతులని అయన పేరిట ప్రతి ఏటా నాటక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు రచయిత్రి డాక్టర్ కెవి కృష్ణ కుమారి మాట్లాడుతూ అక్కినేని తనకు సోదర సమానులన్నారు. సంస్థ అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలికిన సభలో నిర్మాత రామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు కార్యక్రమానికి తొలుత మిత్ర పద్మ శ్రీ సంధ్య వర్షిణి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి సినీ జర్నలిస్ట్ రామా రావు వ్యాఖ్యానం ఆకట్టుకుంది

కార్మిక వ్యతిరేక విధానాలపై సమశీల పోరు

- సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు సాగించాలని సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత పిలుపునిచ్చారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు శుక్రవారం హన్మకొండ ఫాతిమా నగర్‌లోని బాలవికాసలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సిఐటియు పతాకాన్ని జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె హేమలత ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పిస్తూ కళాకారులు పాటలు పాడారు. ఈ సందర్భంగా సిఐటియు జిందాబాద్.. కార్మిక వర్గ ఐక్యత వర్ధిల్లాలి, మతతత్వ విధానాలు నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వర్కింగ్ కమిటీ సమావేశాలను జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత మాట్లాడుతూ ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం పెరుగుతోందని, దీని ప్రభావం మన దేశంపైన తీవ్రంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల పేద, ధనిక తారతమ్యాలు తీవ్రమవుతున్నాయని వాటి దుష్ఫలితాల వల్ల నిరుద్యోగం, దారిద్యం పెరుగుతుందని విమర్శించారు. కనీస వేతనాలు ధరలకు అనుగుణంగా పెరగకపోవడం వల్ల కొనుగోలు శక్తి క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు గణనీయ లాభాలు, కార్మికుల వేతనాలు క్షీణించడం ఒక ధోరణిగా ప్రభవించిందన్నారు. వ్యవసాయరంగం గత ఐదేండ్లుగా సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో ఈ నెల 16న గ్రామీణ భారత్ బంద్, కార్మిక సమ్మెకు సన్నద్ధమవుతున్నట్టు తెలిపారు. ఈ కార్మిక సమ్మెలో కోట్లాదిమంది కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించలేక రామాలయ నిర్మాణం పేరుతో భావోద్వేగాల ఆధారంగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తోందన్నారు. బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం దేశంలోని 139 కోట్ల మంది ప్రజల హక్కులను పణంగా పెడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ముందుగా ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి, సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ స్వాగత ఉపాన్యాసం చేశారు. పోరాటాల గడ్డ, చారిత్రక నగరం హన్మకొండలో జాతీయ సమావేశాలు నిర్వహించడం సంతోషం అన్నారు. ఈ సమావేశాలను ఉపయోగించుకొని రాబోయే కాలంలో ప్రజా, కార్మిక సమస్యల మీద పోరాటాలు చేస్తూ సిఐటియుని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, భూపాల్, ఎస్ రమ, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఉప్పలయ్య, జిల్లా నాయకులు గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, బొట్ల చక్రపాణి, సారంగపాణి, బి సంపత్, రజితలతో పాటు జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిఒ 55ను వెంటనే రద్దు చేయాలి

- యూనివర్సిటీ సమస్యపై సిఎం ఎందుకు స్పందించరు?
- విద్యార్థుల నిరసన.. పరీక్షల బహిష్కరణ
- మద్దతు తెలిపిన బిఆర్ఎస్‌వి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

జిఒ 55ను వెంటనే రద్దు చేయాలని, కుమారి ఆంటీ విషయంలో స్పందించిన సిఎం రేవంత్‌రెడ్డి.. యూనివర్సిటీ సమస్యపై ఎందుకు స్పందించడం లేదని అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రశ్నించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన ధర్నా శుక్రవారం ఉద్రిక్తతకు దారితీసింది. రెండో సంవత్సరం పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులను అడ్డుకున్నారు. యూనివర్సిటీ భూముల విషయంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఎలాంటి పరీక్షలూ రాయబోమని విద్యార్థులు బహిష్కరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పరిపాలన భవనానికి తాళం వేసి టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తాము 25 రోజులుగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రోడ్డుపై ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసిన కుమారి ఆంటీ విషయంలో వెంటనే స్పందించిన సిఎం రేవంత్‌రెడ్డి.. యూనివర్సిటీ విద్యార్థుల నిరసనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పీహెచ్‌డీ చదువుతున్న తమపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తే యూనివర్సిటీ ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

బిఆర్ఎస్‌వి మద్దతు..

విద్యార్థుల నిరసనకు బిఆర్ఎస్‌వి యూత్ స్టేట్ ప్రెసిడెంట్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ ప్రాంతాన్ని పూర్తిగా రియల్ ఎస్టేట్ హబ్‌గా మార్చడానికి సీఎం రేవంత్ రెడ్డి యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోడైవర్సిటీ పార్క్, విద్యార్థులు పరిశోధన చేయడానికి అవకాశం లేకుండా పోతుందని అన్నారు. హైకోర్టు భవనాన్ని ఇక్కడ కాకుండా వేరే ప్రాంతంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు విద్యార్థుల నిరసనకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

CHANGE OF NAME

I SATHIRAJU MEENA KUMARI, W/o.S V L N PHANI SHANKER, aged about 45 years, Occ: Business, Resident of H.No.3-3-107/a. Gokhale Nagar, Ramanthapur,Uppal Mandal, Hyderabad, Medchal- Malkajgiri District, Telangana-500013, Mb.No. 9949733559., do hereby solemnly affirm and state on oath as under:- I would like to change my name MEENA KUMAR SATHIRAJU to SATHIRAJU MEENA KUMARI

CHANGE OF NAME

I S V L N PHANI SHANKER, S/o. Late HANUMANTHARAO, aged about 53 years, Occ: Business, Resident of H.No.3-3-107/a. Gokhale Nagar, Ramanthapur,Uppal Mandal, Hyderabad, Medchal- Malkajgiri District, Telangana-500013, Mb.No. 9949733559., do hereby solemnly affirm and state on oath as under:- I would like to change my name PHANI SHAKAR SATHIRAJU TO S V L N PHANI SHANKAR

In the Court of the Hon'ble VIIth Addl. District - Cum - Family Judge, W.G.Dt., Eluru
FCOP No. 161/2023

Between:
Shaik Shabrin and another ...Petitioners
AND
Shaik Fazil ...Respondent
To:
Shaik Fazil, S/o. late Shaik Ahmad Ali, Research Scientist, Hetro Drugs Pvt. Ltd., Gandhi Nagar, Chintal, Kudbullapur, Hyderabad, Telangana State.

పై నెంబరు O.P. గ్రంధములో శ్రీ కోర్టు వారు రెస్పాండెంటు హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 27-02-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు O.P. గ్రంధము పరిష్కరించబడునని తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
G.V.ANAND KUMAR, Advocate
Eluru, Cell: 9848427001

In the Court of the Hon'ble VIIth Addl. District - Cum - Family Judge, W.G.Dt., Eluru
IA No. 1153/2023 in FCOP No. 161/2023

Between:
Shaik Shabrin and another ...Petitioners/ Petitioners
AND
Shaik Fazil ...Respondent/ Respondent
To:
Shaik Fazil, S/o. late Shaik Ahmad Ali, Research Scientist, Hetro Drugs Pvt. Ltd., Gandhi Nagar, Chintal, Kudbullapur, Hyderabad, Telangana State.

పై నెంబరు పిటిషనులో శ్రీ కోర్టు వారు రెస్పాండెంటు హాజరు నిమిత్తం పలుమార్లు నోటీసులు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 27-02-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు పిటీషను పరిష్కరించబడునని తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
G.V.ANAND KUMAR, Advocate
Eluru, Cell: 9848427001

IN THE COURT OF HON'BLE MACT-CUM-I ADDL, DISTRICT JUDGE:: RANGE REDDY DISTRICT :: AT L.B. NAGAR
O.P.No. 171 Of 2023

Between:
G.Raju ...petitioner
AND
Mahammad Habib & others ...Respondents

NOTICE

To,
(R3) R. Sandeep S/o. not Known to petitioners R/o.2-2-23/22/30, DD colony, Bagh Amberpet, Hyderabad.

Please take notice that the above named petitioner has filed the above **OP** case against you & others for grant of compensation **U/s. 166** of **MV** Act due to injuries sustained to him in a road accident.

That the above case is posted on **23-02-2024** at about **10:30 A.M** for your appearance, if you failed to attend before the Hon'ble Court in the above said date and time, the case will be decided in your absence as per Law.

//BY ORDER OF THE COURT//
Y.SRINIVAS GUPTA
B.SOMAIAH
Advocates
Office at:3-4-142/11
Barkatpura, Hyderabad.
Hyderabad.

IN THE COURT OF THE 2nd ADDITIONAL DISTRICT JUDGE, WEST GODAVARI DISTRICT, ELURU
O.S.N0. 98/2017

Between:
Smt. Javvadi Somalakshmi Anasuya Durgamma And others ...PLAINTIFFS
Vs
Sri. Rayi Sri Rama Krishna Prasad And others ...DEFENDANTS

NOTICE

5. Smt. Vankineni Jhansi Lakshmi, Wife of Chakradhara Rao, property, C/o Dr. Ch. Sudheer, D.No.12/25, Durga Enclave, Near ICICI Bank, 12 th Road, Banjara Hills, Hyderabad. Hyderabad City Civil Court.

6. Smt. Chalasani Revathi, Wife of B. Ratnkar Kotnis, , C/o Dr. Ch. Sudheer, D.No.12/25, Durga Enclave, Near ICICI Bank, 12 th Road, Banjara Hills, Hyderabad. Hyderabad City Civil Court.

7. Smt. Jasthi Rohini, Wife of Sanjeevi, House-wife, 76 th Road, D.No.23/6, Santhi Nagar, Eluru. W.G.DT.

8. Smt. Vankineni Sireesha, Wife of Late Srinivasa Vara Prasad, C/o Dr. Ch. Sudheer, D.No.12/25, Durga Enclave, Near ICICI Bank, 12 th Road, Banjara Hills, Hyderabad. Hyderabad City Civil Court.

9. Vankineni Chakradhara Rao @ Sai, Son of late Srinivasa Vara Prasad, C/o Dr. Ch. Sudheer, D.No.12/25, Durga Enclave, Near ICICI Bank, 12 th Road, Banjara Hills, Hyderabad. Hyderabad City Civil Court.

11. Dasari Venkata Durga Sudhakar Babu, Son of Soma Sekhar Babu, Hindu, Male, Aged 40 years, properties, D.No.9-3-17/2, E.P. Municipal Ward [opp] IBN Church, Vennavallivari pet, Eluru. EJCJ.

WHEREAS the plaintiff filed the suit for recovery of possession of the plaint schedule property. The Honnourable court order notice to the defendants 5 to 9 and 11 in the above suit.

Whereas the notice addressed to the Defendants 5 to 9 and 11 in the above suit could not be served as last known address and the summons could not be served:

Whereas the Honourable court ordered notice of the Defendants 5 to 9 and 11 by way substituted service by way of publication;

You, are hereby called upon to appear in person or through Advocate before this Honurable court on 12-02-2024 at 10-30 AM and state your objections if any. Lest suit will be decided ex-parte.

Eluru, **D.KRISHNA SASTRY**
Dt. 01-02-2024 Advocates for plaintiff

అడుగంటిన భూగర్భజలాలు

- సాగర్ కింద ఎండుతున్న పంట పొలాలు
- నీటి విటిదల కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆందోళనలు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి నివేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ వర్షాకాలంలో ఆశించిన మేరకు వర్షాలు కురువకపోవడంతో ఎగువ రాష్ట్రాల్లోనూ తీవ్ర వర్షాభావం కారణంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రాలేదు. భూగర్భ జలాలూ పెరగలేదు. ఒక చిన్న ఆశతో నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వల ఆధారంగా, బోర్లు, బావుల కింద రైతులు పంటలు సాగు చేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వ డెడ్ స్టోరేజ్‌లో ఉందని ఎవరూ వరి పంట సాగు చేయొద్దని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అధికారులు సూచించారు. అయితే ఎక్కువ మంది రైతులు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేశారు. దీంతో ప్రస్తుతం సాగునీరు విడుదల కాక.. బోర్లు, బావులు అడుగంటిపోయి పంట పొలాలు ఎండిపోతున్నాయి. భూములు నెర్రలు చాచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీటి నిల్వలను బట్టి మొదటి జోన్ వరకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలు పెంపొందించి తమ పంట పొలాలను కాపాడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పుడు ఎడమకాల్వకు నీటిని విడుదల చేయకపోతే భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయి పంటలు పూర్తిగా ఎండిపోయి ఉమ్మడి జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

విస్తీర్ణంలో 30శాతం వరి సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎడమ కాల్వ పరిధిలో 3 లక్షల 94 వేల 285 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం ఉన్నది. ఇందులో 3,03,350 ఎకరాలు భూగర్భజల నీటి వనరులపై ఆధారపడి ఆయకట్టు ఉండగా, 41 ఎత్తిపోతల పథకం కింద 90,922 ఎకరాల ఆయకట్టు ఉన్నది. కానీ, ఈ సీజన్లో తీవ్ర వర్షాభావం కారణంగా సాగునీరు విడుదల కాలేదు. ఆయకట్టులో 30శాతం బోర్లు, బావుల కింద సుమారు 1.20 లక్షల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అధికారులు సూచించినప్పటికీ ఇక్కడి భూములు అనుకూలంగా లేకపోవడంతో వరినే సాగు చేశారు. పంట పొట్ట దశకు రానుంది. ఆ సమయంలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. సకాలంలో నీరు అందితేనే పంట చేతికి వస్తుంది. లేకపోతే పైరు ఎండిపోయే ప్రమాదముంది.

నీటి విడుదల కోసం రైతుల ఆందోళనలు

ఎడమ కాల్వ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక దఫాలుగా రైతులు ఆందోళన చేశారు. సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులను కలిసి నీటిని విడుదల చేయాలని కోరారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి నీటి విడుదల ఆవశ్యకతను వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఆశించిన మేరకు నీటి నిలువ లేనందున.. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆల్మట్టి డ్యాం ద్వారా నీటిని తెప్పించి సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని దాని ఫలితంగా భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు.

కట్ట సైదిరెడ్డి మంగాపురం, వేములపల్లి మండలం

చెరువుల ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. యాసంగి పంటకు మొదట్లో బోర్లు ఆశాజనకంగా పోయడంతో ఆరెకరాలు సాగు చేశాం. భూగర్భ జలాలు అడుగంటడంతో రెండు బోర్లు ఎండిపోయాయి. రెండెకరాల మేర వరి పైరు ఎండిపోయింది. ఎకరాకు రూ.20వేల పెట్టుబడి పెట్టాం. పంట మొత్తం పొట్ట దశలో ఉంది. ఇలాగే కొనసాగితే మిగతా నాలుగు ఎకరాలు కూడా ఎండే ప్రమాదం ఉంది. ప్రభుత్వం దృష్టి సారించి చెరువులు నింపినట్లైతే భూగర్భ జలమట్టం పెరుగుతుంది.

ఏడెకరాల వరి పంట ఎండిపోయింది

బాలకోటి జైత్య తండా, మిర్యాలగూడ మండలం

బోర్లు ఎండిపోవడంతో ఏడెకరాల పైరు నిలువునా ఎండిపోయింది. నాలుగు బోర్లు వేసినప్పటికీ ఫెయిల్ అయ్యాయి. ఎకరాకు రూ.20 వేల పెట్టుబడి పెట్టాను. సుమారు రెండు లక్షల వరకు నష్టపోయాను. ఇప్పటికైనా చెరువులు నింపి భూగర్భ జలమట్టాలు పెరిగేలా చూసినట్లయితే కొద్దిగా పంట చేతికి వస్తుంది.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నాగార్జున సాగర్ నుంచి నీరు విడుదల చేయండి

- మంత్రి ఉత్తమ్‌కు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగు, సాగు నీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, ఎస్ఎల్‌బిసి, వరద కాలువకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి శుక్రవారం హైదరాబాదులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర వర్షాభావం కారణంగా తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. రానున్న వేసవి కాలంలో ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. భూగర్భ జలాలను పెంచేందుకు తక్షణమే చెరువులు, కుంటలు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. చెరువులు కుంటలు నింపితే ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. స్పందించిన మంత్రి సంబంధిత ఎన్ఎస్‌పి ఎస్ఇకి ఫోన్ చేసి నీటి విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో సిపిఎం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం, పారేపల్లి శేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌నుతో ఆకస్మిక తనిఖీ

- సమస్యలు అడిగి తెలుసుకున్న పొన్నం ప్రభాకర్
- సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ తీసుకుంటామన్న మంత్రి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా తూప్రాన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్‌లో ఉన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తూప్రాన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్లో ప్రతి తరగతి గది తిరుగుతూ విద్యార్థులతో ముచ్చటించారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా లేకపోవడం, విద్యార్థుల హాస్టల్ వసతి, క్లాస్ రూమ్ గదులు ఒకే రూమ్‌లో ఉండటంతో అధికారులను పిలిపించి మాట్లాడారు. ఆర్డీఓ జయచంద్రా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్, తహసీల్దార్ విజయలక్ష్మిని పిలిపించి స్కూల్ సమస్యలపై ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. స్కూల్‌లో వాటర్ ప్లాంట్ మరమ్మత్తుల కోసం మంత్రి స్వయంగా రూ.50 వేలను పాఠశాల సిబ్బందికి అందించారు. స్కూల్‌లో ప్రహరీ గోడ లేకపోవడంతో కుక్కలు వస్తున్నాయని మంత్రి దృష్టికి సిబ్బంది తీసుకొచ్చారు. విద్యార్థులు కొంత మంది చెట్ల కింద చదువుతుండటంపై ఆరా తీశారు. వెంటనే అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో పాటు రెసిడెన్షియల్ స్కూల్స్ కమిషనర్ రమణ బాబు, మెదక్ కలెక్టర్ రాజర్షి షాతో ఫోన్‌లో మాట్లాడారు. స్కూల్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. స్కూల్‌లో విద్యార్థులకు బెడ్స్ ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒను ఆదేశించారు. ప్లే గ్రౌండ్‌లో ఆట వస్తువులతో పాటు ఓపెన్ జిమ్, తాగునీటి సౌకర్యంతో పాటు వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం, శానిటేషన్ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్‌ను ఆదేశించారు. పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని తహశీల్దార్‌కు సూచించారు. పాఠశాల సిబ్బంది సైతం విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన సిబ్బందితో పాటు వాచ్‌మెన్‌లను సన్మానించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పాత 35 రెసిడెన్షియల్ స్కూల్సలలో తూప్రాన్ స్కూల్ ఒకటని, స్కూల్‌లో మార్పులు జరగాలని, పాఠశాల రూపురేఖలు మార్చాలని ఆకస్మికంగా విజిట్ చేసినట్టు తెలిపారు. సిఎస్ఆర్ ఫండ్స్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌ల ద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించామని తెలిపారు. త్వరలోనే జిల్లా కలెక్టర్ విజిట్ చేయాలని సూచించారు. అందరూ సహకరించాలని, ఆదర్శ మోటార్స్ వారితో లైబ్రరీ కట్టించేలా మాట్లాడామన్నారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుప్రాన్ ఆర్‌డిఒ జయ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్, తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపిడిఒ అరుంధతి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవాభివృద్ధికి జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించాలి

- ప్రకృతి సంపదకు ప్రతి జీవిని కాపాడాలి
- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మానవ అభివృద్ధి కోసం జీవ వైవిధ్యాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహిస్తూ ప్రకృతి సంపదను పెంచాలని దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ మున్సిపల్ పరిధిలోని నెక్నాంపూర్ పెద్ద చెరువు వద్ద రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు, ధృవాస్ సంస్థ సహకారంతో చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవ వేడుకలకు ఆమె హాజరై మాట్లాడారు. చిత్తడి నేలలు జీవవైవిధ్యం, మానవ శ్రేయస్సు గురించి కమ్యూనిటీలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. మానవ అభివృద్ధికి భూమిపై ఉన్న ప్రతి జీవరాశిని కాపాడాపాలని తెలిపారు. నీటి నుంచి కాలుష్య కారకాలను ఫిల్టర్ చేయగల దీర్ఘకాలిక సామర్థ్యం చిత్తడి నేలలకు ఉంటాయన్నారు. వ్యర్థాలు, ప్లాస్టిక్, డ్రయినేజీ వేయకుండా చిత్తడి నేలలను రక్షించే బాధ్యత అందరూ తీసుకోవాలని సూచించారు. రామ్‌సర్ ఒప్పందంలో పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా దేశంలో 74 వెట్ ల్యాండ్ స్పాట్స్ ఉండగా.. తెలంగాణలో ప్రస్తుతానికి అమీన్‌పూర్‌లో వెట్ ల్యాండ్ స్పాట్‌ను గుర్తించినట్టు తెలిపారు. టూరిస్టులు సేదతీరడానికి వెట్ ల్యాండ్ స్పాట్ చాలా ఆహ్లాదకరంగా ఉంటాయని, అందుకే వాటిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ పోటీ, ప్రాజెక్టు ఎగ్జిబిషన్, జీవవైవిధ్యంపై ఫొటో ఎగ్జిబిషన్, పర్యవరణ జీవన శైలిపై ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారి వాణిప్రసాద్, జీవవైవిధ్య మండలి అధికారి ఖార్తాడె, కలెక్టర్ శశాంక, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ధృవాస్ సంస్థ డైరెక్టర్ మధులిక, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

- 873 మందికి నియామక పత్రాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ జిల్లాలోని ఇండోర్ స్టేడియం, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఉపాధి దోహద శిక్షణ సంస్థ, టీఎస్ స్టెప్, హైదరాబాద్ ధృవ్ కన్సల్టింగ్ సర్వీసెస్, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చింది. 5454 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్, వరంగల్‌కు చెందిన దాదాపు 65 ప్లస్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 873మందికి నియామక పత్రాలు అందజేశారు. 3,078 మందితో షార్ట్ లిస్ట్ తయారు చేశారు. వివిధ కంపెనీలలో ఉపాధి పొందిన మొదటి పది మంది అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) కుమారి రాధికా గుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ శ్రద్దాశుక్లా జాబ్ మేళాను ప్రారంభించారు.

మియాపూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్ఎండిఎ అసిస్టెంట్ సైట్ ఇన్‌చార్జి గౌతమ్ హెచ్చరించారు. హైదరాబాద్ మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 ప్రభుత్వ భూముల్లో కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టగా.. శుక్రవారం హెచ్ఎండిఎ, రెవెన్యూ అధికారులు ఆ అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నం ఎవరు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. అమాయక ప్రజలు కొంతమంది రియల్టర్ల మాటలు నమ్మి ప్రభుత్వ భూములు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఎవరూ మధ్యవర్తుల మాటలు నమ్మి ప్రభుత్వ భూములు కొనుగోలు చేయొద్దని సూచించారు. నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం ఎవరు చేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సందర్శించిన వారిలో.. శేరిలింగంపల్లి ఆర్ఐ శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సంతోష్‌రెడ్డి, రెవెన్యూ హెచ్ఎండిఎ సిబ్బంది ఉన్నారు.

జీవన్‌ధాన్ తెలంగాణకు 'హయత్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ ఫ్రేమ్‌వర్క్' పురస్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పురస్కారం అందుకుంటున్న జీవన్‌ధాన్ తెలంగాణ ఇన్‌చార్జి ప్రొఫెసర్ స్వర్ణలత

మరణించిన వారి అవయవాలను సేకరించి అవయవ మార్పిడికి అసాధారణమైన కృషి చేయడం.. సంబంధిత అధికారుల విజయాలకుగాను అంతర్జాతీయ స్థాయిలో జీవన్‌ధాన్ తెలంగాణకు 'హయత్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ ఫ్రేమ్‌వర్క్' పురస్కారం లభించింది. జనవరి 27న హోటల్ కాన్రాద్ దుబాయ్ మెయిన్ హాల్‌లో జరిగిన వార్షిక యుఎఇ ఆర్గాన్ డొనేషన్, ట్రాన్స్‌ప్లాంట్ కాంగ్రెస్-2024లో జీవన్‌ధాన్ తెలంగాణకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్గాన్ డొనేషన్, ట్రాన్స్ ప్లాంటేషన్ నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ అలీ అబ్దుల్ కరీమ్ అల్ ఒబైద్లీ, మానవుల అవయవాలను విరాళం అండ్ మార్పిడిని నియంత్రించే నేషనల్ సెంటర్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్స్‌ఫర్ట్ డైరెక్టర్ డాక్టర్ పౌలా గోమెజ్, యుఎఇ ఆరోగ్య మంత్రిత్వ శాఖ చేతుల మీదుగా ప్రముఖ నిమ్స్ నెఫ్రోలాజిస్ట్ అండ్ జీవన్‌ధాన్ తెలంగాణ ఇన్‌చార్జి ప్రొఫెసర్ స్వర్ణలత పురస్కారం అందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల ప్రొఫెసర్ స్వర్ణలతను పంజాగుట్ట నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ సాయిబాబా, ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ ప్రొఫెసర్ శాంతివీర్, వివిధ విభాగాధిపతులు, వైద్యులు అభినందించారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి

- శంషాబాద్‌లోని రాళ్లగూడలో ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతిచెందిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ రాజీవ్ గృహకల్ప సముదాయం పక్కన గుడిసెల్లో కోళ్ల సూర్యకుమార్ అతని కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద కొడుకు నాగరాజు (1సం॥), చిన్న కొడుకుకి 20 రోజులు. జనవరి 31 రాత్రి 12.15 గంటలకు బాబు పాల కోసం ఏడవగా.. సూర్యకుమార్ లేచి పాలు తాగించి పడుకోబెట్టాడు. ఆ తర్వాత వారు నిద్రలోకి జారుకున్నారు. ఈ సమయంలో గుడిసెలో నిద్రిస్తున్న ఏడాది చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గుడిసె నుంచి బయటికి లాగి కరిచి చంపాయి. మృతి చెందిన చిన్నారి శవం చుట్టూ కుక్కలు చేరగా.. అదే గుడిసెల సమీపంలో నివాసం ఉంటున్న రౌతు నాగరాజ్ అనే వ్యక్తి ఏం జరుగుతుందని దగ్గరకెళ్ళి చూడగా.. కుక్కల మధ్యలో బాలుడి మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుని తండ్రి వద్దకు వెళ్లి జరిగిన ఘటన గురించి చెప్పారు. అనంతరం పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడకన.. రూ.44 కోట్ల పనులు!

- వాజేడు-వెంకటాపురం రహదారి పనుల్లో నాణ్యతా లోపం
- అధికారుల బాధ్యతా రాహిత్యం..
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం !
- మేడారం నాటకిఅందుబాటులోకొచ్చేనా?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా వాజేడు మండలం వై జంక్షన్ నుంచి వెంకటాపురం మండలం ఎదిర వరకు రూ.44 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నారు. ఇంజినీరింగ్ అధికారుల బాధ్యతా రాహిత్యం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో పనుల్లో నాణ్యత లోపించినట్టు ఆరోపణలొస్తున్నాయి. గత బిఆర్ఎస్ పాలనలో రోడ్డు పనులు దక్కించుకున్న వరంగల్‌కు చెందిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధి రోడ్డు పనులు ప్రారంభించినప్పటి నుంచి పనుల్లో నాణ్యత చేపట్లేదని విమర్శలొస్తున్నాయి. అసంపూర్తి పనులతో వెంకటాపురం-వాజేడు మండలాల్లో ప్రధాన రహదారిపై గుంతలు, కంకరతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

భద్రాచలం-చంద్రుపట్ల ఆర్అండ్‌బి రహదారి రెండు మండలాల పరిధిలో 65 కి.మీ నుంచి 113 కి.మీ వరకు విస్తరించి ఉంది. ఇసుక క్వారీల నిర్వాహణ, అధిక లోడు వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైంది. రహదారి మరమ్మతులకు సంబంధిత శాఖ రూ.23.80 కోట్ల అంచనాను రూపొందించింది. ఐదు బిట్లుగా విభజించిన ఈ రహదారి పనులను వరంగల్‌కు చెందిన ఓ నిర్మాణ సంస్థ దక్కించుకుంది. పనుల్లో జాప్యం, గోదావరి వరదలతో ఈ మార్గం పూర్తిగా ధ్వంసమైంది. ఈ క్రమంలో ఆ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి దాదాపు 46 కి.మీ మార్గాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించేందుకు రూ.44 కోట్లకు అనుమతి ఇచ్చినట్టు తెలిసింది. ఈ పనులను సైతం అదే గుత్తేదారుతో చేయించేందుకు ప్రణాళిక చేపట్టినా ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జగన్నాథపురం వై జంక్షన్ నుంచి వెంకటాపురం, చొక్కాల నుంచి పాత్రాపురం శివారు వరకు దాదాపు 18 కి.మీ పనులు పూర్తయ్యాయి. ఇంజినీరింగ్ అధికారి పర్యవేక్షణ లేకపోవడం, గ్యాంగ్‌మెన్‌ల ఆధ్వర్యంలో పనులు కొనసాగడంతో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేసినట్టు తెలుస్తోంది. దాంతో కొత్తగా వేసిన రోడ్డు పాడై దాని కింద ఉన్న పాత రోడ్డు దర్శనమిస్తోంది. లోపాలను కప్పిపుచ్చుకునేందుకు ఓవర్ లోడ్ వాహనాల రాకపోకలను అధికారులు సాకుగా చూపుతున్నట్టు సమాచారం. మరోవైపు పాత్రాపురం నుంచి ఎదిర గుట్టల వరకు 28 కి.మీ మేర మార్గంలో అనేక చోట్ల తారు తొలగించి కంకర పరిచి వదిలేశారు. దాంతో పెద్ద మొత్తంలో దుమ్ము లేస్తూ వాహనాదారులను ఇబ్బందుకుల గురిచేస్తోంది.

జాతరలోపు పూర్తయ్యేనా..?

మేడారంలో ఫిబ్రవరి 21 నుంచి 24 తేదీ వరకు సమ్మక్క, సారలమ్మ మహాజాతర జరగనున్న నేపథ్యంలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల సందర్శకులు ఈ రహదారినే ఉపయోగిస్తారు. ప్రస్తుతం రోడ్డంతా అసంపూర్తి పనులతో గుంతలు ఉండటంతో ప్రయాణం ఆలస్యం అవుతోంది. జాతర ప్రారంభం నాటికి ఈ మార్గాన్ని పూర్తి స్థాయిలో బాగుచేస్తే ప్రయాణికులు, సందర్శకులకు ఇక్కట్లు తప్పనున్నాయి. ఆ దిశగా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది. మంత్రి సీతక్క దృష్టి సారించి రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి : వంకా రాములు, అంకన్నగూడెం

అసంపూర్తి పనుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై తారు తొలగించి కంకర పోయడంతో దుమ్ము, దూళి అంతా మా ఇండ్లలోనే ఉంటోంది. పెద్ద పెద్ద గుంతల వల్ల వాహనదారులూ ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి రోడ్ల కారణంగా చాలా ప్రమాదాలు జరిగాయి.

పగుళ్లతో ఇబ్బందులు : కొప్పుల రఘుపతి, జగన్నాథ పురం

వెంకటాపురం నుంచి వై జంక్షన్ వరకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నాసిరకంగా పోసిన తారునూ ఇటీవల మళ్ళీ తవ్వారు. కానీ పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలో దొంగలు అధికారంలోకి వచ్చారు

- ఉచిత బస్సు ప్రయాణంతో రోడ్డునపడిన ఆటో డ్రైవర్లు
- మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో కెటిఆర్

మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో దొంగలు అధికారంలోకి వచ్చి, ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం కొర్రెముల చెరుకు బాలయ్య గార్డెన్‌లో ఎమ్మెల్యే మలారెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో కెటిఆర్ ప్రసంగించారు. లంకె బిందెలున్నాయని వచ్చి చూస్తే ఖాళీ కుండలు ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి అనడం దురదృష్టకరమన్నారు. లంకె బిందెల కోసం రాత్రిపూట దొంగలు గడ్డపారలు, తట్టలు పట్టుకొని వస్తారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అదే దొంగలు అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు. సచివాలయంలో లంకె బిందెలుండవని కంప్యూటర్లు, ఫైళ్లు, జిఒలుంటాయని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకపోతే వెంటాడి భరతం పడతామని హెచ్చరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500 ఇస్తానని మాట ఇచ్చారని, దానికోసం రాష్ట్రంలో కోటి 57 లక్షల మంది ఆడపడుచులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రంలో 6.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తల వెంట ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉంటారని భరోసా కల్పించారు. ఢిల్లీలో మన గొంతు వినిపించాలంటే మనం పార్లమెంటులో ఉండాల్సిందేనని చెప్పారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా గట్టిగా నిలబడి బిఆర్ఎస్ నాయకులను గెలిపించుకుందామన్నారు.

కృష్ణా జలాల్లో తెలంగాణ వాట తేల్చే సమయం ప్రధాని మోడీకి లేదన్నారు. కృష్ణా జలాల కోసం పోరాటం బిఆర్ఎస్ వల్లే సాధ్యపడుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మన హక్కులను కేంద్రం వద్ద తాకటు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా కూటమికి బీటలు పారిందని, ఇప్పుడు ఆ కూటమిలో ఎవరూ లేరన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి నిరంతరం మేడ్చల్ ప్రజల కోసం పరితపించే వ్యక్తి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు వాచ్‌మెన్‌గా పనిచేస్తానని మల్లారెడ్డి అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి, ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మెన్ చామకూర భద్రారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.